# ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రత

- క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రత
- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లలో ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, పక్కన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

తెలంగాణ చౌక్, నవంబర్ 29: జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవీఎంల పంపిణీ కార్యాక్రమాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి సందర్శించారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా 560 పోలింగ్ కేంద్రాల్లో 1700 మందికిపైగా భద్రతా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. పోలీస్ స్టేషన్లలోని ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని పోలింగ్ పూర్తయిన తరువాత తిరిగిపంపే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విధులునిర్వహించే ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిది పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లరాదని తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే ఓటర్లు, పోలింగ్ ఏజెంట్ల వద్ద అగ్గిపెట్టెలు, నీళ్లబాటిళ్లు, సెల్‌ఫోన్ తదితర వస్తువులు ఉండకుండా చూడాలన్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, చంటిపిల్లల తల్లులు, ఓటు వేయడానికి వచ్చే సమయంలో వీలైనంత త్వరగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏదైనా అనుకోని ఘటనలు జరిగే అవకాశం ఉంటే వెంటనే మొబైల్ పార్టీకి సమాచారం అందించాలని సూచించారు. రూట్ మొబైల్ పార్టీలు ఈవీఎంలకు ఎస్కార్ట్‌గా ఉండి పంపిణీ కేంద్రం నుంచి పోలింగ్ స్టేషన్‌కు చేర్చి, తిరిగి పోలింగ్ పూర్తయిన తర్వాత తీసుకొని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అప్పగించే వరకు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలను కలుపుతూ ఉన్న రూట్లు, కేంద్రాల వద్ద గుంపులు ఉండకుండా చూడాలన్నారు. పోలింగ్ స్టేషన్ చుట్టుపక్కల 100 గజాల వరకు ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు లేకుండా చూడాలని తెలిపారు. ఓటర్లను ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, జీపులు, కార్లలో తరలించకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ అఖిల్ మాహాజన్

## కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ తెరలను పరిశీలిస్తున్న అధికారులు

కలెక్టరేట్, నవంబర్ 29: సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల వెబ్ కాస్టింగ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను బుధవారం రాత్రి ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్, ఎన్నికల పోలీసు పరిశీలకురాలు వినీతాసాహు, ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి, కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు పెద్ద డిజిటల్ తెరలను వీక్షించారు. ఇక్కడ సంబంధిత అధికారులు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

వీర్నపల్లి, నవంబర్ 29: మండలంలోని అన్ని గ్రామాల పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది సామాగ్రితో బుధవారం సాయంత్రం చేరుకున్నారు. జిల్లా కేంద్రంలోని డిస్టిబ్యూషన్ సెంటర్ నుంచి కేంద్ర బలగాల భద్రత మధ్య ప్రత్యేక వాహనాల్లో సిబ్బందిని తరలించారు. సీతారాంనాయక్‌తండా పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి ఎన్నికల సిబ్బంది సామగ్రితో కిలోమీటర్ వరకు కాలినడకన నడిచి వెళ్లారు. మండలంలో 16 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సెక్టోరియల్ ఆఫీసర్ నరేశ్‌కుమార్ తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన వీర్నపల్లి, కంచర్ల, రంగంపేట, గర్జనపల్లి పోలింగ్ స్టేషన్లలో కేంద్ర సాయుధ బలగాలతో భద్రత కల్పిస్తున్నట్లు ఎస్ఐ నవత తెలిపారు.

## ఎన్నికలకు సర్వం సిద్ధం

ఇల్లంతకుంట, నవంబర్ 29 : మండల కేంద్రం తోపాటు అన్ని గ్రామాల్లో ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో మీర్జా బుధవారం పేర్కొన్నారు. మండలంలోని 29 పోలింగ్ కేంద్రాలు, 58 బూత్‌లు ఉండగా 140 మంది ఎన్నికల సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 48 వేల ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

## పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

రుద్రంగి, నవంబర్ 29: నేడు మండలంలో జరుగునున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల అధికారి తెలిపారు. మండలం కేంద్రంతో పాటు మానాల, గిరిజనతండాల్లో మొత్తం 8 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో నలుగురు సిబ్బందితో పాటు అదనంగా పోలిస్ సిబ్బంది విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

## చందుర్తికి చేరిన ఎన్నికల సిబ్బంది

చందుర్తి, నవంబర్ 29:అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాలకు బుధవారం రాత్రి పీవో, ఏపీవో, ఓపీవోలు చేరుకోగా అక్కడే బస ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 33 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనుంది.



ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

# ఘనంగా దీక్షా దివస్



సిరిసిల్లటౌన్: తెలంగాణ భవన్‌లో అమరవీరుల స్తూపం ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 29: జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో బుధవారం దీక్షా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. అంతకుముందు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన కేసీఆర్ దీక్షతో తెలంగాణ సమాజం ఉద్యమంలో ఏకతాటిపైకి వచ్చిందన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన మహానీయుడు సీఎం కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్‌ను నేడు జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గంభీరావుపేటలో..**

గంభీరావుపేట, నవంబర్ 29: మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ దీక్షా దివస్‌ను బుధవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్ప ఫలితంగానే నేడు పేదలకు సంక్షేమ పథకాలకు అందుతున్నాయని చెప్పారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకుని మా అనాథ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌ను అందించారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న సీఎం కేసీఆర్‌పై ఆశీస్సులు ఉండాలని వెంకటస్వామిగౌడ్ వృద్ధులను కోరారు. కార్యక్రమంలో పటణాధ్యక్షుడు పెద్దవేని వెంకటియాదవ్, నేతలు లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి, పిట్ల శ్రీమతి తదితరులు ఉన్నారు.



గంభీరావుపేట: ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు అందిస్తున్న మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, నేతలు

# ఉత్తమ సేవలకు పురస్కారాలు



ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను సన్మానిస్తున్న ఆర్ఎం వీ సుచరిత

కలెక్టరేట్, నవంబర్ 29: విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందించిన వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రగతి చక్ర పురస్కారాలను ప్రతి యేటా అందిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ వీ సుచరిత తెలిపారు. బుధవారం సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో ప్రగతిచక్ర అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కరీంనగర్ రీజియన్‌లో సిరిసిల్ల డిపో రెండో స్థానంలో నిలిచినందున ప్రగతి చక్ర అవార్డులు పంపిణీ చేశామని తెలిపారు. విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందిస్తున్న శ్రామిక్, హెల్పర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సన్మానంతోపాటు అవార్డులు ఇచ్చి సత్కరించిదని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులను సన్మానించి అవార్డులను అందజేశామని వెల్లడించారు. ఇక్కడ డిప్యూటీ ఆర్ఎం సత్యనారాయణ, భూపతిరెడ్డి, ఏకే ఖాన్, ఎల్ సారయ్య, కే నర్సింహులు, జీ మల్లేశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.